


# కథ

## పెద్ద గీత చిన్న గీత

డా॥ సి.యల్ రాణి

ఉదయం పదిన్నర అయ్యింది. నా కళ్లవెంట ధారాపాతంగా కన్నీళ్ళు ప్రవహిస్తున్నాయి. రుమాలుతో తుడుచుకుంటూ పోలీస్ స్టేషన్‌లో అడుగు పెట్టాను. ఎస్సైగారిని కలిస్తే, "సి.ఐ గారు ఇంకా రాలేదు. ఆయన కోసం వెయిట్ చెయ్యండి. మీకు సర్టిఫికేట్ ఆయనే సంతకం చేసి ఇవ్వాలి!" అని అన్నారు. సిఐ గారి రూమ్ ముందు కుర్చీలలో నేను, మావారు, మా అబ్బాయి శ్రేయస్ కూర్చు న్నాము. నా మనస్సు గతంలోకి వెళ్ళిపోయింది.

మా అబ్బాయి వారం రోజుల క్రిందట లండన్‌లో ఎమ్.బి.ఎ చేసి ఇండియాకు వచ్చాడు. హైదరాబాద్‌కి వాడి ఫ్లైట్ అర్ధ రాత్రప్పుడు వచ్చింది. నేను, మావారు వాడిని ఎయిర్ పోర్టుకు వెళ్ళి రిసీవ్ చేసుకున్నాం. ఆటో ఎక్కి ఇంటికి వచ్చేసరికి రాత్రి మూడున్నర అయ్యింది. వాడు వచ్చిన సంతోషంలో కబుర్లు చెప్పుకుంటూ లగేజ్ దింపుకోవడంలో చిన్న ఎయిర్ బేగ్‌ని దింపుకోవడం మరచిపోయాము. మేము మరచిపోయిన సంగతి ఆటో డ్రైవర్‌కి కూడా తెలియదు. ఆ బాగ్‌ని మావారు సీట్ వెనుక పెట్టేరు. ఆ విషయం మాకు మార్నాడు వరకు తెలియలేదు. మర్నాడు ఉదయం పది గంటలకు నిద్ర లేచిన శ్రేయస్ "అమ్మా! నా చిన్న ఎయిర్ బేగ్ ఏది! అని అడిగాడు. వాడు తెచ్చిన లగేజ్ మొత్తం వెతికాను. ఎక్కడా కనిపించలేదు. వాడు షాక్‌తో కూలబడి "అమ్మా! నా ఒరిజినల్ సర్టిఫికేట్లు అన్నీ అందులోనే ఉన్నయి. నా టెన్త్ క్లాస్, ఇంటర్, బిటెక్., ఎమ్.బి.ఏ, ఒరిజినల్స్, పాస్ పోర్టు, అన్నీ అందులోనే ఉన్నాయి. నాకు ఉద్యోగం ఎలాగ వస్తుంది. నా కెరీర్ అంతా పాడైపోయింది. నాలైఫే నాశనం అయింది" అంటూ బావురుమన్నాడు. నాకు కాళ్ళు, చేతులు ఆడలేదు. నాకు ఏడుపు తన్నుకు వచ్చింది. మావారు కంగారు పడ్డా వెంటనే సర్దుకొని మాయిద్దరిని ఊరుకోబెట్టారు. పోలీస్ కంప్లయింట్ ఇద్దామన్నారు. మేము ముగ్గురం పోలీస్ స్టేషన్‌కి వెళ్ళాము ఎస్సైగారిని కలిస్తే, సి.ఐ గారిని కలిసి కంప్లయింట్ ఇమ్మన్నారు. సి.ఐ గారు చాలా మంచివారు మమ్మల్ని ఎగతాళి చేయకుండా, అవమానించకుండా బాగా మాట్లాడారు. వివరాలు అన్నీ రాసి ఇమ్మన్నారు. "మేము మా శాయశక్తులా ప్రయత్నిస్తాం మీరు వెంటనే న్యూస్‌పేపర్లలో ఏడ్ ఇవ్వండి" అని చెప్పి తనకు తెలిసిన ఒక న్యూస్ ఏజెంట్‌కి ఫోన్ చేసి పిలిపించారు.

అతనికి చెప్పి మాచేత ఏడ్‌మేటర్ వ్రాయించి మర్నాడు పేపర్లలో వచ్చేటట్టు చేయమన్నారు. మేము పోయిన సర్టిఫికేట్ల వివరాలను వ్రాసి వాటిని తెచ్చి ఇచ్చిన వాళ్లకు పదివేల రూపాయలు బహుమతి ఇస్తామని ప్రకటించాం. సి.ఐ గారు ఎస్సైగారిని పిలిచి రాత్రి ఎయిర్ పోర్టులో పాసింజర్లని ఎక్కించుకున్న ఆటో డ్రైవర్ల వివరాలను తెలుసుకోమన్నారు. ఆటో యూనియన్ల లీడర్లకు ఈ విషయం చెప్పమన్నారు. మాఫోన్ నెంబరు అడిగి దాన్ని తన సెల్‌ఫోన్‌లో ఫీడ్ చేసుకుని "ఏ పోలీస్ స్టేషన్‌లో సర్టిఫికేట్లు దొరికినా మీకు తెలియజేస్తాము. వారం రోజలు వెయిట్ చేద్దాము. అప్పటికీ దొరకకపోతే సర్టిఫికేట్లతో ఉన్న బేగ్ దొరకలేదని సర్టిఫికేట్ ఇస్తాము. దానితో మీరు డూప్లికేట్లకు అప్లయ్ చేయవచ్చు" అని చెప్పారు. నాకు ఏడుపు ఆగడం లేదు. వాడి ఎమ్.బి.ఏ. డిగ్రీని చూడలేక పోయాము.

మేము పోలీస్ కంప్లయింట్ పేపర్ ఏడ్లతో ఆగకుండా ఇతర ప్రయత్నాలు కూడా చేసాము. ఆటో యూనియన్లఆఫీసులకు వెళ్లి నాయకులను కలిసి ఎలాగైనా ఆ ఆటో డ్రైవర్‌ని పట్టుకోమని, అతనికి పదివేలు రూపాయలు ఇస్తామని చెప్పాము. కాని ఆ ఆటో డ్రైవర్ దొరకలేదు. నాలో ఏదో చిన్న ఆశ. ఇల్లు తెలుకుకదా! అతను వస్తాడని సర్టిఫికేట్లు ఇస్తాడని, వారం రోజులు గడిచాయి. పోలీసులు కానీ, ఆటో యూనియన్లకు కానీ ఆ ఆటో డ్రైవర్ గురించి తెలియలేదు. సర్టిఫికేట్ల జాడలేదు. న్యూస్ పేపర్ల యాడ్స్‌కు జవాబులేదు. అవి దొరుకుతాయి అనే ఆశ కూడా లేదు.

ఈ వారం రోజులు నేనుగానీ, మావాడు కానీ తిండి తినలేదు. నిద్రపోలేదు. మావారు ఎంత బాధపడుతున్న కడుపులోనే దాచుకునేవారు. పోలీస్ స్టేషన్‌లో ఒక్కసారి కలకలం మొదలయింది. నేను గతంలోంచి వర్తమానంలోకి వచ్చేను. ముప్పై ఐదు, నలభై సంవత్సరాల మధ్య వయస్సు గల ఆవిడను ఇద్దరు లేడీ కానిస్టేబుల్స్ బలవంతంగా పోలీసు స్టేషన్‌లోకి తీసుకు వస్తున్నారు. ఆవిడ 'నా కొడుకుని వెంటనే చూపించండి' అని, గట్టిగా ఏడుస్తూ గుండెలు బాదుకుంటూ క్రింద కూర్చోవడానికి ప్రయత్నిస్తుంది. నాకు వెంటనే ఆమె కొడుకుని పోలీసులు ఎన్‌కౌంటర్ చేసేసేమోనని అనుమానం వచ్చింది. ఆవిడ వెనుక

ఇద్దరు మొగవాళ్ళు ఇద్దరు ఆడవాళ్ళు వస్తున్నారు. వాళ్ళందరూ ఆవిడని ఊరుకోబెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. ఆవిడను అందరూ బలవంతంగా సి.ఐ గారి రూమ్‌కి తీసుకువెళ్ళి కూర్చోబెట్టారు. నేను ఆరూమ్ దగ్గరకు వెళ్లాను. ఆవిడతో వచ్చిన ఆడవాళ్ళలో ఒకావిడ నాకు గుళ్ళో బాగా పరిచయం. ఆవిడ పేరు రమ. రమ దగ్గరకు వెళ్ళి 'ఏమిటి జరిగింది' అని అడిగేను.

రమ చెప్పడం మొదలు పెట్టింది. 'ఏడుస్తున్న ఆవిడ పేరు ఉదయలక్ష్మి. ఆవిడ మేము పక్క పక్క ఫ్లాట్లలో ఉంటున్నాం. ఆవిడ భర్త దుబాయిలో పనిచేస్తున్నాడు. ఆవిడకు ఒక్కడే కొడుకు. వాడిపేరు ప్రణీత్. లేక లేక పుట్టాడు. ఆ అబ్బాయి వయస్సు పదిహేను సంవత్సరాలు. వాడిని అపురూపంగా పెంచుకుంటున్నారు. విపరీతంగా ముద్దు చేస్తారు. ప్రణీత్ చాలా మంచివాడు. నిన్ననే తన బర్త్‌డే. నిన్ననే టెన్త్ రిజల్ట్సు వచ్చేయి. 90 శాతం మార్కులు వచ్చాయి. తన బర్త్‌డేకి మోటర్ బైక్ వాళ్ల నాన్నగారిని అడిగేడట. ఆయన ప్రణీత్ బర్త్‌డే నాడు ఇంటికి బైక్ వచ్చేటట్టు ఏర్పాటు చేసేరట. ఆయన అబ్బాయి వయస్సు గురించి డ్రయివింగ్ రాదనే విషయం గురించి ఆలోచించలేదు. నిన్న మధ్యాహ్నం మాయింటికి స్వీట్స్ పట్టుకుని వచ్చి ప్రణీత్ నా కాళ్ళకు దణ్ణం పెట్టి "ఆంటీ! నా బర్త్‌డేకి రెండు గిఫ్ట్స్. ఒకటి నాన్నగారు కొన్న బైక్. రెండు టెన్త్‌లో నా రిజల్ట్" అన్నాడు. "నీకు పదిహేనేళ్ళు ఇవాళే నిండాయి కదా! డ్రయివింగ్ లైసెన్స్ ఎలాగ వస్తుంది? పైగా నీకు డ్రయివింగ్ రాదు కదా! బండికి తొందరేముంది? అసలే రోజులు బాగాలేవు. నీకు ఎందుకీ బైక్ పిచ్చి? "అని ప్రేమగా దెబ్బలాడేను. దానికి ప్రణీత్ "ఆంటీ! మా ఫ్రెండ్ నాన్నగారికి ఆర్టీఓ ఆఫీస్‌లో తెలిసిన వారు ఉన్నారట. వాళ్ళ ద్వారా దొంగ డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికేట్‌తో డ్రయివింగ్ లైసెన్సు సంపాదిస్తానన్నారు". నా ఫ్రెండ్ బైక్ చాలా సార్లు డ్రయివ్ చేసాను. నాకు డ్రయివింగ్ వచ్చు మీరేం భయపడకండాంటీ" అన్నాడు. నేను "ఏది ఏమయినా బాగా డ్రయివింగ్ వచ్చే వరకూ మెయిన్ రోడ్ల మీదకు వెళ్ళక, ముందు డ్రయివింగ్ బాగా నేర్చుకో" అన్నాను. సరేనని బుర్ర ఊపాడు.

"ఇవాళ ఉదయం ఉదయలక్ష్మి ఆరు గంటలకు నిద్రలేచిందట. గుమ్మం తలుపులు దగ్గరగా వేసి ఉన్నాయట. ప్రణీత్ ఇంట్లోలేడట. ఎక్కడికో ఫ్రెండ్‌తో వెళ్ళి ఉంటాడని ఆవిడ అనుకుంది. తొమ్మిది గంటలకు ఈ పోలీస్ స్టేషన్ ఎస్సైగారు ఇద్దరు కానిస్టేబుళ్ళను పంపి ఆవిడను స్టేషన్‌కు తీసుకు రమ్మన్నారట. ఆవిడ వెంటనే ఈ విషయం మాకు చెపితే అందరం కలిసి ఇలాగ వచ్చేం. గాబరా పడుతూ ఇక్కడికి వస్తే ఒక కానిస్టేబుల్ ప్రణీత్‌కి ఏక్సిడెంట్ అయింది అని చెప్పేడు".

ఎస్సైగారు వచ్చి "ఉదయలక్ష్మిగారి తాలుకా ఎవరైనా ఇలా నా రూమ్‌లోకి రండి" అని పిలిచేరు. రమ తన వెనకాతల నేను ఆయన గదిలోకి వెళ్ళాము. ఎస్సైగారు మమ్మల్ని కూర్చోమని చెప్పి" ఈ రోజు ఉదయం అరున్నరకు పల్సర్ బైక్ మీద ముగ్గురు కుర్రాళ్ళు నక్లెసు రోడ్డులో స్పీడుగా వెళుతూ మార్నింగ్ వాక్ చేస్తున్న ఒకావిడని గుద్దేసి ఆ ఊపున పుట్‌పాత్‌ని గుద్ది బైక్‌తో సహా పడిపోయారు. ఒక అబ్బాయి బహుశా డ్రయివ్ చేస్తున్నవాడయి ఉంటాడు. అక్కడికక్కడే చనిపోయేడు. మిగిలిన ఇద్దరు సీరియస్ కండిషన్లో ఉన్నారు. వాళ్ళని మార్నింగ్ వాకర్స్ కొంత మంది హాస్పిటల్లో చేర్చారట. కొద్ది సేపట్లో వాళ్ళిద్దరూ చనిపోయేరు. వాళ్ళు గుద్దేసిన ఆవిడ పరిస్థితి సీరియస్‌గా ఉందట. ఆ ముగ్గురి కుర్రాళ్ళలో ఒక అబ్బాయి జేబులో స్కూల్ ఐడి కార్డు ఉంది. ఆ అబ్బాయి పేరు ప్రణీత్. ఆ అబ్బాయి ఇంటికి మావాళ్ళు వెడితే తండ్రి ఇండియాలో లేడు. తల్లి ఉదయలక్ష్మిగారని తెలిసింది. ఆ అబ్బాయి డెడ్‌బాడీకి పోస్టుమార్టం చేయించాలి. డెడ్‌బాడీని ఆవిడకు హ్యాండోవర్ చేయాలి. వాటికి ఆవిడ సంతకాలు కావాలి. అందుకే ఆవిడను రమ్మన్నాం. కానీ ఆ అబ్బాయి చనిపోయినట్లు చెప్పలేదు. సీరియస్‌గా ఉందని చెప్పేము. ఆవిడకు ఈ విషయం నెమ్మదిగా చెప్పండి. కాని సి.ఐ గారు వచ్చేలోపల ఇది జరిగి పోవాలి. ఆయన రాగానే ఫార్మాలిటీస్ అన్నీ జరిగిపోవాలి". అని చెప్పారు.

రమ ఏడవడం మొదలు పెట్టింది. నాకు కళ్ళు చెమ్మగిల్లాయి. తనని ఊరుకోబెట్టి ఉదయలక్ష్మిగారి దగ్గరకు తీసుకు వెళ్ళాను. ఆవిడ ఇంకా ఏడుస్తూనే ఉంది. ఆవిడకు తన ఒక్కగాకొక్క కొడుకు ఆయుష్షు తీరిపోయింది. ఎలా చెప్పాలో మా ఇద్దరికీ అర్థం కాలేదు. లేడీ కానిస్టేబుళ్ళు మమ్మల్ని చూసి ఆవిడ చేత బలవంతంగా నీళ్ళు త్రాగించేరు. వాళ్ళు, మేము నెమ్మదిగా విషయాన్ని చెప్పేము. అంతే! ఆవిడ మొదలు నరికిన చెట్టులాగా గుండె పట్టుకుని కుర్చీలోంచి క్రింద పడిపోయింది. కళ్ళు తేలవేసింది. హార్ట్ ఎటాక్ వచ్చిందనుకుంటాను. తన గదిలోంచి చూస్తున్న ఎస్సైగారు వెంటనే బయటకు వచ్చి అంబులెన్స్‌కి ఫోను చేసారు. కానిస్టేబుళ్ళు ఇంకొక నలుగురు వచ్చి ఫస్ట్‌ఎయిడ్ చెయ్యడం మొదలు పెట్టారు. ఇంతలో అంబులెన్స్ వచ్చింది. ఆవిడను అంబులెన్స్‌లోకి ఎక్కించారు. ఆవిడతో పాటు రమ ఇక్కడికి వచ్చిన వాళ్ళ ఇరుగు – పొరుగు వారు అంతా వెళ్ళిపోయేరు.

అరగంట తరువాత సి.ఐ గారు వచ్చేరు. ఎస్సైగారు జరిగిన విషయాలు చెప్పిన తరువాత సి.ఐగారు మమ్మల్ని రమ్మని కబురుచేసారు. విచిత్రం నా కళ్లవెంట నీరు కారడంలేదు. కాని మనసంతా మొద్దు బారిపోయింది. నామొహం అంతా పాలిపోయింది రక్తం అంతా ఒంట్లోంచి ఎవరో తోడేసినట్లు అయింది ఆ తల్లి కష్టం ముందు నా కష్టం ఎంత? మా బాబువి ఒరిజినల్స్ పోతేపోయేయి. మళ్ళీ డూప్లికేట్లు దొరుకుతాయి. కాకపోతే కొంత టైమ్ పడుతుంది. జాబ్ రావడం ఆలస్యం కావచ్చు. కానీ ప్రణీత్ తిరిగి వస్తాడా? నిజానికి ఆ ప్రణీత్ ఎవరో నాకు తెలియదు. ఎలా ఉంటాడో తెలీదు. కాని ఆ కుర్రవాడి మరణం నామనస్సును విపరీతంగా కలిచివేస్తుంది. నామనస్సుకి నొప్పి అనిపిస్తుంది. బంగారు భవిష్యత్తు ఉన్న కొడుకుపోయి, ఆ బాధను పంచుకోడానికి భర్త దగ్గరలేక, అనారోగ్యంతో ఉన్న ఆవిడ పరిస్థితిని ఊహించలేకపోతున్నాను.

సి.ఐ గారి గదిలోకి మేము వెళ్ళగానే ఆయన మమ్మల్ని కూర్చోమని చెప్పి మావారితో "మేము చాలా ట్రై చేసేము. ఆ ఆటో డ్రైవర్ దొరకలేదు. మీ బాబు ఒరిజినల్స్ ట్రేస్ చేయలేక పోయాం. వెరీవెరీ సారి. అవి దొరకలేదనే సర్టిఫికేట్ ఇస్తాము. దాని జిరాక్స్ కాపీలు తీయించి వాటితో డూప్లికేట్ సర్టిఫికేట్లకు ఎప్లయి చేయండి" అని చెప్పి నావంక చూసి "మేడం! ఏంటంత అప్‌సెట్ అయ్యేరు? డూప్లికేట్లు వస్తాయి కదా! మీరే ఇంత బాధపడుతుంటే బాబు ఇంకెంత వర్రీ అవుతాడు? ధైర్యం చెప్పాల్సిన మీరే డీలా పడిపోతే ఎలా!" అని ధైర్యం చెప్పేరు. కాని ఆయనకు తెలీదుకదా! నేను అప్‌సెట్ అయింది ప్రణీత్ విషయంలోనని.

చిన్నప్పుడు మా అమ్మమ్మ చెప్పే కథ నాకు గుర్తుకు వచ్చింది. శ్రీకృష్ణ దేవరాయులు ఒక పలకమీద గీతనుగీసి, దానిని చెరపకుండా, ముట్టుకోకుండా చిన్నది చేసే వ్యక్తిని వెతికి పట్టుకు రమ్మని తన భటులను పంపేరట. అలాంటి వ్యక్తి తప్పక చాలా తెలివైనవాడవుతాడు. అతన్ని తన ప్రధానిగా నియమించుకోవాలనుకున్నాడట. తిమ్మరుసు భటుల దగ్గర ఆ పలకను తీసుకుని ఆ గీతకు కొంచెం పైన ఇంకొక పెద్దగీతను గీసాడట. అప్పుడు శ్రీకృష్ణ దేవరాయుల గీసిన గీత చిన్నదయిపోయిందట. తిమ్మరుసుని తన ప్రధాన మంత్రిగా రాజు నియమించుకున్నాడట. ఇదీ ఆ కథ సారాంశం. భగవంతుడు ఉదయలక్ష్మిగారి బాధ అనే పెద్దగీత దగ్గర మా బాధను చిన్నగీత చేసేడు.